ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

సిద్దిపేట

5

శుక్రవారం 21 మార్చి 2025



రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:32 (శుక్రవారం సాయంత్రం)

సహర్: 4:57 (శనివారం ఉదయం)

పెండింగ్ కేసులను పరిష్కరించాలి

- సీపీ అనురాధ

సిద్దిపేట క్రైం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలని సీపీ అనురాధ హుస్నాబాద్ డివిజన్ పోలీస్ అధికారులకు సూచించారు. గురువారం ఆమె హుస్నాబాద్ డివిజన్ పోలీసు అధికారులతో పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పెండింగ్ ఉన్న కేసులపై సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. పదోతరగతి పరీక్షల సందర్భంగా పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఫిర్యాదుదారుల తో మర్యాదపూర్వకంగా మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారు. డయల్ 100 కాల్స్‌పై అలసత్వం వహించకూడదని హెచ్చరించారు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం విజబుల్ పోలిసింగ్ విధులు నిర్వహించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, హుస్నాబాద్ ఏసీపీ సతీష్, హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్, చేర్యాల సీఐ శ్రీను, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఏవో యాదమ్మ, సూపరింటిండెంట్ మహ్మద్ ఫయాజుద్దీన్, హుస్నాబాద్ డివిజన్ ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించరూ!

- లో వోల్టేజీతో పంటలు ఎండుతున్నాయని రైతుల గగ్గోలు
- మోటార్ల సమస్యేనంటున్న అధికారులు

8

కిట్ల కిరికిరి..!

- రంజాన్ తోఫాలపై రాజుకుంటున్న వివాదం
- నిరుపేదలకు నిత్యావసర సరుకులనందిస్తున్న స్వచ్ఛంద సంస్థలు
- ఈ ఏడాది 3వేల కిట్లు సిద్ధం
- పదేళ్ల నుంచి బీఆర్ఎస్ పంపిణీ
- ఈ ఏడాది తామే అందిస్తామంటున్న కాంగ్రెస్
- బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్‌గా మారిన వైనం
- నేడు అందజేసేందుకు ఏర్పాట్లు
- కిట్లు ఉన్న మదీనా ఫంక్షన్‌హాల్ వద్ద పోలీసుల బందోబస్తు



మదీనా ఫంక్షన్‌హాల్ వద్ద పోలీసుల బందోబస్తు

సిద్దిపేటటౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటలో ప్రతి ఏడాది మాదిరిగానే అందజేసే రంజాన్ తోఫాలపై ఈ సారి వివాదం రాజుకుంది. రంజాన్ మాసంలో ఉన్నత వర్గానికి చెందిన వారు స్వచ్ఛంద సంస్థలను ఏర్పాటు చేసి నిరుపేదలకు తంజీమ్ సందర్భంగా నిత్యావసర సరుకులు అందజేస్తారు. ఆ సరుకులను పండుగకు వారం, పది రోజుల ముందు తంజీమ్ కోర్కే మేరకు పదేళ్ల నుంచి మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అందిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది కూడా దాదాపు 3వేల కిట్లను అందించేందుకు స్థానిక మదీనా ఫంక్షన్‌హాల్ వద్ద సిద్ధంగా ఉంచారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో స్వచ్ఛంద సేవా సంస్థలు అందిస్తున్న రంజాన్ తోఫా (జకాత్)లను తామే అందిస్తామని కాంగ్రెస్‌కు చెందిన నాయకులు తేల్చి చెబుతున్నారు. ఎవరికి వారు నిరుపేదలకు కిట్లను అందించేందుకు టోకెన్లను సైతం పంపిణీ చేసి, నేడు (శుక్రవారం) ఉదయం అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.



పంపిణీకి సిద్ధంగా ఉన్న రంజాన్ కిట్లు

కాంగ్రెస్‌కు సంబంధం లేదు : బీఆర్ఎస్

మాజీమంత్రికి చెందిన స్నేహితుడు, ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వహకుడు ముస్లింలకు కిట్లను అందిస్తున్న విషయం తెలుసుకుని సిద్దిపేటలోని నిరుపేద ముస్లింలకు కూడా అందజేయాలని కోరడంతో పదేళ్ల నుంచి సిద్దిపేటలో రంజాన్ కిట్లు అందిస్తున్నామని, ఆ రంజాన్ కిట్లకు కాంగ్రెస్‌కు సంబంధం ఏంటని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. తంజీమ్ ద్వారా తోఫాలను పంచుతున్నప్పుడు రాజకీయ నాయకులకు పాల్గొనవద్దని, అసలు సంబంధమే ఉండదని స్వచ్ఛంద నిర్వహకులే చెబుతున్నారని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. పదేళ్ల బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కిట్లను పంచిందని, కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు

మిగతా 8వ పేజీలో



దరఖాస్తుల పరిశీలనకు యాప్

- జిల్లా 74,272 దరఖాస్తులు
- పరిశీలన అనంతరం కొత్తకార్డులు మంజూరు

సిద్దిపేట కలెక్టరేట్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : రేషన్‌కార్డుల మంజూరుకు చేసిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందించారు. దరఖాస్తులను పరిశీలించి వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయనున్నారు. యాప్‌లో దరఖాస్తుల విచారణ అనంతరం ఆర్ఐ నుంచి తహసీల్దార్‌కు అక్కడి నుంచి డీఎస్‌వో లాగిన్‌కు వస్తాయి. వార్డు ఆఫీసర్ లాగిన్ నుంచి మున్సిపల్ కమిషనర్‌కు అక్కడి నుంచి డీఎస్‌వో లాగిన్‌కు వస్తాయి. వీటన్నింటినీ డీఎస్‌వో పౌరసరఫరాలశాఖ కమిషనర్ లాగిన్‌కు ఆన్‌లైన్‌లో సమర్పించనున్నారు. కార్డుల మంజూరు వివరాలు పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్థాయిలో వెల్లడిస్తారు.

అనుమతి రాగానే అర్హులకు కొత్త రేషన్‌కార్డులు

ప్రజాపాలన గ్రామసభల్లో జిల్లావ్యాప్తంగా దాదాపు కొత్తకార్డులు, సభ్యులను చేర్చేందుకు ఇతర అన్ని కలిపి దాదాపు 74,272 దరఖాస్తులు అందాయి. ఈ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఆయా దరఖాస్తుల పరిశీలన బాధ్యతను మున్సిపాలిటీల్లో వార్డు అధికారులకు అప్పగించనున్నారు. మండలాల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు(ఆర్ఐ) పరిశీలించనున్నారు. ఎంపిక చేసిన ఆర్ఐలు, వార్డు అధికారుల మొబైల్ ఫోన్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. వారికి లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ కేటాయించనున్నారు. వారు దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి విచారణ చేస్తారు. ఇందుకు కచ్చితమైన మార్గదర్శకాలు విడుదల చేయనున్నారు. గతంలో రేషన్ కార్డులో పేరు నమోదు చేయాలని, తప్పులు సవరించాలని కోరుతూ కొన్నేళ్లుగా మీసేవ కేంద్రాల్లో వేలాది మంది దరఖాస్తులు చేసుకున్నారు. అవి కూడా పెండింగ్‌లో ఉన్నాయి. ఇవి ఆర్ఐ, తహసీల్దార్, డీఎస్‌వో లాగిన్‌లో వేర్వేరు దశల్లో ఉన్నాయి. ఈ దరఖాస్తుల పరిష్కారంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సి ఉంది. ఇదే విషయంపై డీఎస్‌వో తనూజశ్రీ ను వివవరణ కోరగా ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే రేషన్ కార్డుల అప్లికేషన్ పరిశీలించి, అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు.

విజయీభవ

- నేటి నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభం
- 79 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు



హాల్ టికెట్ నెంబర్స్ వేస్తున్న సిబ్బంది

సిద్దిపేట కల్చరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షలకు జిల్లా విద్యాధికారులు సర్వం సిద్ధం చేశారు. నేటి నుంచి వచ్చే నెల 4 వరకు జరిగే పరీక్షల కోసం జిల్లావ్యాప్తంగా 79 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో 14124 మంది రెగ్యులర్ విద్యార్థులు, 14 మంది ప్రయివేట్ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. 79 మంది చీఫ్ సూపరెండెంట్ ఆఫీసర్లు, డిపార్ట్మెంట్ ఆఫీసర్లను నియమించారు. 4 ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్స్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి 20 మందికి ఒక ఇన్విజిలేటర్ ఉంటారు. జిల్లాలోని తొమ్మిది సీ కేటగిరి సెంటర్లకు ప్రత్యేకంగా ఎనిమిది మంది కస్టోడియన్లను నియమించారు. ప్రతిరోజు ఉదయం 9.30 నిమిషాలకు ప్రారంభమవుతాయని, అరగంట ముందే విద్యార్థులు పరీక్ష సెంటర్ చేరుకోవాలని అధికారులు సూచించారు. జిల్లాలోని 79 పరీక్ష కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అమలులో ఉంటుంది.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి : కలెక్టర్

కోహెడ/అక్కన్నపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అందరూ 10 జీపీఏ సాధించాలని విద్యార్థులకు కలెక్టర్ ఎం.మనుచౌదరి సూచించారు. విద్యార్థులే కేంద్రంగా విద్యాబోధన జరగాలని, డిజిటల్ బోధనను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గురువారం కోహెడ శనిగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, అక్కన్నపేట మండలం అంతకపేటలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ల్యాబ్‌లను ప్రారంభించి మాట్లాడారు. 10 నెలల క్రితం శనిగరం స్కూల్‌కు వచ్చినపుడు టీఎస్ ఐజీ డైరెక్టర్‌తో మాట్లాడి సేల్స్ ఫోర్సెస్ సంస్థ, నిర్మాన్ ఎన్జీవో సంస్థ సహకారంతో రూ.10లక్షలతో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రూ.50లక్షలతో శనిగరం, కోహెడ, అంతక్కపేట హైస్కూల్‌లలో ల్యాబ్‌లను ఏర్పాటు చేసేందుకు సహకరించిన టీఎస్ ఐజీ డైరెక్టర్ అర్చన సురేష్, నిర్మాన్ ఫోర్సెస్ సంస్థ ప్రతినిధి కిరణ్మయి, ఎన్జీవో ప్రతినిధి మధురీ కనకాలకు ఆయన ధన్యవాదములు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి, కోహెడ తహసీల్దార్లు సురేఖ, అనంతరెడ్డి ప్లానింగ్ అండ్ ఎంఐఎస్ కోఆర్డినేటర్ రామస్వామి, ఎంఈవోలు పద్మయ్య, రంగానాయక్, పాఠశాల హెచ్‌ఎంలు ఎండీ మహమూ ద్, సరళ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



అక్కన్నపేట మండలం అంతకపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ మనుచౌదరి

బెట్టింగ్ గిగ్గింగ్



- పల్లెలకు పాకిన మహమ్మారి
- ఈజీమనీ కోసం యువత ఆరాటం
- అప్పులు చేసి మరీ ఆన్‌లైన్‌లో..
- రూ.లక్షలు కోల్పోతున్న కొందరు
- చివరికి బికారులుగా మారుతున్న వైనం

గజ్వేల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతీ పల్లెటూరుకు బెట్టింగ్ కల్చర్ పాకింది. ఇంటర్నెట్ గ్రామ గ్రామానికి రావడం ప్రతి ఒక్కరి చేతిలో మొబైల్ ఫోన్ అందుబాటులోకి రావడం, సోషల్ మీడియాలో ఆసక్తికర ప్రమోషన్లు, చేతిలో ఉన్న అరకొర డబ్బుతో కోటీశ్వరులమవుతామని చిన్నతనంలోనే కలలు కనే అనేక మంది యువకుల ప్రాణాల మీదకు తెస్తుంది. ఇటీవల పెరిగిన బెట్టింగ్ కల్చర్‌తో అనేకమంది యువకులు లక్షలు పోగొట్టుకుని అప్పుల పాలవుతున్నారు. త్వరలో ఐపీఎల్ ప్రారంభం కానున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర పోలీసు యంత్రాంగం బెట్టింగ్ యాప్‌లపై కఠినంగా వ్యవహరిస్తుండడంతో పలువురు యువకులు అల్లాడిపోతున్నారు. సినీనటులు, సెలబ్రిటీలపై కేసులు నమోదవడంతో కొంతమంది యువకులు బెట్టింగ్ విషయమై పునరాలోచనలో పడ్డారు. ఈ విషయంలో ఇటీవలే జిల్లా పోలీసు కమిషనర్ అనురాధ సైతం ప్రత్యేకంగా ప్రెస్‌నోట్ విడుదల చేస్తూ బెట్టింగ్ యాప్‌ల విషయంలో నిక్కచ్చిగా ఉంటామని పేర్కొనడంతో కొంత మేర యువతలో బెట్టింగ్ యాప్‌ల వైపు చూడడం లేదు.

అప్పుల పాలైన యువకులు

బెట్టింగ్ కల్చర్, బెట్టింగ్ యాప్‌లలో పెట్టుబడులు, ఈజీ మనీ కోసం వెంపర్లాడుతున్న క్రమంలో అనేక మంది యువకులు అప్పులపాలయ్యారు. కొందరు బయట అధిక మొత్తానికి వడ్డీకి తెచ్చి ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడుతున్నారు. అందులో నష్టం రావడంతో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఈ క్రమంలోనే గజ్వేల్ పట్టణానికి చెందిన ఇద్దరు యువకులు గతంలో బెట్టింగ్‌లలో పెట్టుబడులు పెట్టి అప్పులు పెరిగి ఆత్మహత్యలకు పాల్పడ్డారు. వారి కుటుంబాలు ప్రస్తుతం రోడ్డున పడ్డాయి. వారి తల్లిదండ్రులను చూసే నాథుడు లేకపోవడంతో వృద్ధాప్యంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా మున్సిపాలిటీకి చెందిన ఓ వ్యాపారి కుమారుడు బెట్టింగ్‌లో డబ్బు పోగొట్టుకుని దాదాపు రూ.కోటి పైగా తాను చేసిన అప్పును తండ్రితో కట్టించినట్లు తెలుస్తుంది. మరో యువకుడు చిన్నతనంలోనే బెట్టింగ్‌లకు అలవాటు పడి అప్పులు తీర్చే మార్గం లేక, ఇంట్లో చెప్పుకునే ధైర్యం లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ రోజుల్లో వందలో ఒక్కరైనా ఈ ఆన్‌లైన్ బెట్టింగులు, ఆన్‌లైన్ గేమింగ్‌కు అలవాటు పడి అప్పుల పాలై ఆస్తులు అమ్ముకోవడం, క్రెడిట్ కార్డుల్లో లక్షలాది రూపాయలు అప్పులు చేసి ఆగమవడం సర్వ సాధారణంగా మారింది. ఇళ్లలో తెలిస్తే ఆత్మహత్యలకు పాల్పడడం, మత్తు పదార్థాలకు అలవాటు పడడం కొన్నిరోజుల్లోనే జరిగిపోతుంది. ఈ క్రమంలోనే తమ పిల్లలపై తల్లిదండ్రులు ఓ కన్నేసి ఉంచాలని పోలీసులు చెబుతున్నారు.

నిఘా పటిష్ఠం

బెట్టింగ్, గేమింగ్ కల్చర్, గంజాయి, మత్తు పదార్థాలపై సిద్దిపేట జిల్లా పోలీసులు కొన్నాళ్లుగా పటిష్ఠ నిఘాను ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా బెట్టింగ్‌లకు పాల్పడే పలువురు యువకులపై పోలీసు నిఘాను ఏర్పాటు చేసినట్లు తెలిసింది. త్వరలోనే ఐపీఎల్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో యువత బెట్టింగ్ యాప్‌లలో పెట్టుబడులపై ఎంతో ఆశ పెట్టుకోగా, తాజాగా బెట్టింగ్ యాప్‌లు ప్రమోషన్ చేసిన సెలబ్రిటీలపై కేసులు నమోదవడంతో కొంతమేర వణికి పోతున్నట్లు తెలుస్తుంది. ఇంకొందరు బెట్టింగ్‌లు లేకపోతే ఎలా అని ఆందోళన చెందుతున్నట్లు పలువురు యువకులు చెబుతున్నారు. సోషల్ మీడియాలో ప్రకటనలు చేసే వారికి కఠిన శిక్షలు వేస్తేనే ఇలాంటివి పునరావృతం కాకుండా ఉంటాయని పలువురు మేధావులు అభిప్రాయపడుతున్నారు.

ప్రాణాల మీదుకు తెచ్చుకోవద్దు

యువత, విద్యార్థులు అక్రమ బెట్టింగ్ యాప్స్, గేమ్ యాప్‌లకు అలవాటు పడి అప్పుల పాలై ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు. ఆన్‌లైన్ గేమింగ్, యాప్‌లలో గేమ్స్ ఆడేందుకు ప్రోత్సహించినా కఠిన శిక్షలు తప్పవు. సాంకేతిక పరిజ్ఞానం, సోషల్ మీడియా ప్రభావం బాగా పెరిగిన నేపథ్యంలో ప్రతి తల్లిదండ్రులు వారి పిల్లలపై ఓ కన్నేసి ఉంచాలి. మోసపూరిత ప్రకటనలు నమ్మి డబ్బు పెట్టుబడిగా పెట్టి నష్టపోవద్దు. సోషల్ మీడియా వచ్చే ప్రకటనల పట్ల జాగ్రత్తగా ఉండాలి. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో పటిష్ఠ నిఘాను ఏర్పాటు చేశాం. ఈ విషయంపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

- సీపీ అనురాధ



ముగిసిన ఇంటర్ పరీక్షలు

సిద్దిపేట కల్చరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ముగిశాయి. జిల్లావ్యాప్తంగా గురువారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 8711 మంది రాయాల్సి ఉండగా 8446 మంది హాజరయ్యారు. జగదేవ్‌పూర్ పరీక్షా కేంద్రంలో ఓ విద్యార్థి కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడడంతో అధికారులు విద్యార్థిని డిబార్ చేశారు. పరీక్షలు ప్రారంభం నుంచి ముగిసే వరకు జిల్లావ్యాప్తంగా 13 మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. ఈ సందర్భంగా పరీక్షల కన్వీనర్, జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పరీక్షలు విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన సీఎస్‌లు, డీవోలు, స్క్వాడ్ సభ్యులు హెచ్‌పీసీ, డీఈసీ సభ్యులు, కస్టోడియన్లతో పాటు పోలీస్, పోస్ట్ ఆఫీస్, రెవెన్యూ, ఆర్టీసీ తదితర విభాగాల అధికారులు, సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



యూత్ పార్లమెంట్ ఫెస్టివల్ షురూ

- రెండు రోజుల పాటు జిల్లాస్థాయి పోటీలు

7



బొలెరో బోల్తాపడి ఒకరి మృతి.. పలువురికి గాయాలు

రాయికోడ్, మార్చి20 (ఆంధ్రజ్యోతి) : రేగోడ్ మండలం చౌదర్ పల్లి గ్రామానికి చెందిన సుమారు 20మంది గురువారం బొలెరోలో రాయికోడ్ మండలం హస్నాబాద్‌లో జరిగిన ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. తిరిగి వస్తుండగా సింగితం గ్రామ శివారులో ప్రమాదవశాత్తు బొలెరో బోల్తాపడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న దొడ్ల మణెమ్మ, గంగమణి, మనూష, అశ్విత, హారిక, లక్కి, అంబమ్మలకు గాయాలయ్యాయి. వారిని 108లో జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మణెమ్మ(60) మార్గమధ్యలో మృతిచెందింది.

యూత్ పార్లమెంట్ ఫెస్టివల్ షురూ

● రెండు రోజులపాటు జిల్లాస్థాయి పోటీలు



పోటీల్లో పాల్గొన్నవారికి ధ్రువపత్రాలు అందజేస్తున్న దృశ్యం

సిద్దిపేట కల్చరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వికసిత్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్ గురువారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రారంభమైంది. రెండు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాలను నెహ్రూ యువ కేంద్ర, కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. కళాశాల ప్రిన్సిపాల్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ జి సునీత సభ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి మల్లన్న సాగర్ డిప్యూటీ ఇంజనీర్ సీహెచ్ శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎన్‌వైకే సిద్దిపేట జిల్లా యువజన అధికారి ఏం. రంజిత్ రెడ్డి పాల్గొన్నారు. స్క్రీనింగ్ కమిటీ ఎంపిక చేసిన 150 మంది విద్యార్థులు 2 రోజుల పాటు జరిగే జిల్లాస్థాయి యూత్ పార్లమెంట్‌లో ఉపన్యసిస్తారు. గురువారం మొదటి రోజు నోడల్ జిల్లా నుంచి కొంతమంది విద్యార్థులు వన్ నేషన్ వన్ ఎలక్షన్ అనే అంశంపై తమ అభిప్రాయాలు పంచుకున్నారు. శుక్రవారం 150 మందిలో బెస్ట్ 10 మందిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు. కార్యక్రమంలో జిల్లా కోర్డినేటర్ డా. ఎం. శ్రద్ధానందం, పరీక్షల నియంత్రణ అధికారి డా. జి.సుదర్శనం, ఐక్యూఏసీ కోర్డినేటర్ మధుసూదన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థుల స్క్రీనింగ్ ఇలా..

వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో భాగంగా ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో సిద్దిపేట జిల్లాను నోడల్ జిల్లాగా ఎంపిక చేశారు. ఈ జిల్లా పరిధిలోకి, సిద్దిపేట, మేడ్చల్ మల్కాజిగిరి, జనగామ జిల్లాలు వస్తాయి భారతీయ యూత్ పార్లమెంట్‌లో భాగంగా యువత అభిప్రాయాన్ని దేశ నిర్మాణంలో ఉపయోగించుకోవాలని ఉద్దేశంతో వీడియో సందేశాన్ని విద్యార్థుల నుంచి ఆహ్వానించారు. సిద్దిపేట నోడల్ జిల్లా పరిధిలో దాదాపు 800 మంది యువతి యువకులు వీడియో అప్లోడింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. 150మందిని స్క్రీనింగ్ చేసి జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. ఎంపిక చేసిన వారిని జిల్లాస్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ జిల్లా కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ రంగాలలో నిష్ణాతులైన న్యాయ నిర్ణేతల సమక్షంలో విద్యార్థులని స్క్రీనింగ్ చేస్తారు.

వ్యవసాయంలో మహిళలూ ఎదగాలి

● జిల్లా వ్యాప్తంగా మహిళలకు శిక్షణ
● పైలట్ ప్రాజెక్టు కింద అందోలు ఎంపిక
● సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి



మహిళా రైతులకు డ్రోన్ విడ్జెట్ కిట్‌ను అందజేస్తున్న కలెక్టర్

జోగిపేట, మార్చి20(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో మహిళలూ రాణించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు. సాగుబడిలో సాంకేతికతను అందిపుచ్చుకుని వ్యవసాయంలో ఎదిగేలా మహిళలకు ప్రభుత్వం శిక్షణ ఇస్తుందని తెలిపారు. గురువారం స్థానిక మహిళా సమాఖ్య భవనంలో జిల్లా వ్యాప్తంగా సుమారు 50 మంది మహిళా సంఘ సభ్యులకు డ్రోన్ వాడకంపై సెర్ప్- వ్యవసాయ శాఖ-హెటిరో డ్రగ్స్ సంయుక్త ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణను ఆమె, జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంప్రదాయ వ్యవసాయంలో సాంకేతికతను జోడించడం ద్వారా , పెట్టుబడి తగ్గడంతోపాటు, సస్యరక్షణ చర్యలు సరిగా చేపట్టవచ్చునన్నారు. డ్రోన్ ద్వారా మందులు పిచికారీ చేయడం వల్ల ఎకరాకు రూ. 400 వరకు సంపాదించవచ్చునన్నారు. డ్రోన్ వాడకంలో రోజుకు సుమారు 20 ఎకరాల వరకూ మందులు చల్లవచ్చునని తెలిపారు. వారంలరోజుల పాటు అందించే డ్రోన్ శిక్షణను సద్వినియోగం చేసుకుని అదనపు ఆదాయాన్ని పొందాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్, హెటిరో డైరెక్టర్ సుధాకర్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ జంగారెడ్డి, ఆర్డీవో పాండు,తహసీల్దారు విష్ణుసాగర్, ఎంపీడీవో రాజేశ్, సెర్ప్ ఏపీఎంలు మాణిక్యం (అందోలు), చంద్రశేఖర్ (వట్‌పల్లి), శివలక్ష్మి(పుల్కల్), మహిళా రైతులు పాల్గొన్నారు.

సాగునీటి కోసం రోడ్డెక్కిన అన్నదాతలు



రాంపూర్ క్రాసింగ్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

నంగునూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నంగునూరు మండలం అక్కెనపల్లి మోయా తుమ్మెద పెద్ద వాగులోకి సాగునీరు చేరకముందే నిలిపివేశారని, తిరిగి విడుదల చేయాలని కోరుతూ సిద్దిపేట- హనుమకొండ రహదారిలోని రాంపూర్ క్రాసింగ్ వద్ద గురువారం రైతులు ఆందోళన చేపట్టారు. అక్కెనపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. రంగనాయక సాగర్ ద్వారా సాగు నీరు అందకపోవడంతో వేసిన పంటలు చేతికందే సమయానికి ఎండుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత ఎండాకాలంలో అక్కెనపల్లి, నంగునూరు పెద్ద వాగులోకి సాగునీరు విడుదల చేయడంతో చివరి పంటవరకు సాగునీరు అందింది. ఈ సారి పెద్ద వాగు పై ఉన్న చెక్ డ్యామ్‌ల్లోకి సాగునీరు రాకముందే ఇరిగేషన్ అధికారులు నీటిని మరో వైపు మళ్లించారని ఆరోపించారు. అధికారులు అక్కెనపల్లి పెద్ద వాగులో ఉన్న చెక్ డ్యామ్‌లు అన్ని నింపేలా చర్యలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న రాజగోపాల్ పేట ఎస్ఐ ఎండీ ఆసిఫ్ పోలీస్ సిబ్బంది తో కలిసి అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఇరిగేషన్ అధికారులు వచ్చి నీటిని విడుదల చేసేంత వరకూ రాస్తారోకో విరమించబోమని రైతులు మొండికేశారు. సిద్దిపేట రూరల్ సీఐ శ్రీనివాస్ అక్కడికి చేరుకుని ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించగా నీటిని విడుదల చేస్తామని వారు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

రూ. 88 కోట్లతో అభివృద్ధి పనులు

● ఇప్పటివరకు రూ.5.33 కోట్ల విలువైన కల్యాణలక్ష్మి అందజేత
● త్వరలో యంగ్ ఇండియా స్కూల్ భవన నిర్మాణానికి శ్రీకారం
● మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్

మెదక్, మార్చి20(ఆంధ్రజ్యోతి) : రూ. 88 కోట్లతో మెదక్ పట్టణంలో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ అన్నారు. గురువారం మెదక్ పట్టణంలోని స్టేడియం సమీపంలోని విద్యుత్ భవనంలో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, షాదిముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 66 మంది లబ్ధిదారులకు రూ. 66.07 లక్షల విలువగల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి వరకు మొత్తం రూ.5.33 కోట్ల విలువైన కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను అందజేసినట్లు తెలిపారు. మెడికల్, నర్సింగ్ కళాశాలను తెచ్చుకోవడమే కాకుండా తరగతులనూ ప్రారంభించుకున్న విషయాన్ని గుర్తుచేశారు. మెదక్‌లోనే సెంట్రల్ మెడికల్ స్టోర్‌ను ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఎంఎస్ఎస్‌వో స్వచ్ఛంద సంస్థ పేద ప్రజలకు అండగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు ఏదైనా పనికోసం కమీషన్‌లు అడిగితే అక్కడే నిలదీయాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గూడూరి ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రావు, మాజీ తాజా కౌన్సిలర్‌లు దొంతి లక్ష్మి ముత్యంగౌడ్, ప్రవీణ్‌గౌడ్, దాయర రాజలింగం, లక్ష్మీనారాయణ, ఆవారి శేఖర్, వసంత్, గోదల సాయి, అశోక్, రమేష్, పద్మ, మనోజ్, వెంకటనారాయణ, శ్రీనివాస్ చౌదరి, రాజు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి తీవ్ర గాయాలు

● పరిస్థితి విషమం

శివ్వంపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన అల్లిపూర్‌లో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన నువ్వా శ్రీనివాస్(40) బుధవారం మధ్యాహ్నం ఉపాధి పనులకు వెళ్లి ఇంటికా రాగా విద్యుత్ సరఫరా నిలిచి పోయి ఉన్నది. గ్రామంలో ఎస్సీ కాలనీలో విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేస్తుండగా గ్రామంలో ఎల్‌సి ఉందని భావించిన శ్రీనివాస్ విద్యుత్ అధికారులకు సమాచారం లేకుండానే విద్యుత్ స్తంభం పైకి ఎక్కి మరమ్మతులు చేస్తున్నాడు. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురైన అతడిని కుటుంబీకులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాస్ పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు తెలిసింది.

అత్తపై దాడి చేసిన అల్లుడికి రిమాండ్

పుల్‌కల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అత్తపై దాడి చేసిన అల్లుడికి రిమాండ్ విధించారు. పుల్కల్ ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రమైన పుల్కల్‌కు చెందిన ఇసోజీపేట చంద్రకళ కూతురు పూజితను 2019లో మునిపల్లి మండలం తక్కడపల్లి గ్రామానికి చెందిన గొల్ల కృష్ణకు ఇచ్చి వివాహం చేసి ఇల్లరికం తెచ్చుకున్నారు. తాగుకు బానిసైన కృష్ణా కొన్ని రోజులు పుల్కల్‌లో, ఆ తరువాత సదాశివపేట ఎంఆర్ఎఫ్ పరిశ్రమ ఎదుట హోటల్‌ను ఏర్పాటు చేసి సరిగా నిర్వహించలేక మూసివేశాడు. అనంతరం కుటుంబ పోషణకై హైదరాబాద్ నగరానికి వెళ్లి కారు డ్రైవింగ్ చేశాడు. 2023 మార్చి 16వ తేదీన హైదరాబాద్ నుంచి పుల్కల్‌కు వచ్చి మద్యం తాగి భార్య పూజిత, అత్త చంద్రకళతో గొడవ పడ్డాడు. ఈ ఘర్షణలో అత్త చంద్రకళను బలంగా కొట్టడంతో ఆమె కోమాలోకి వెళ్లారు. దీనిపై భార్య పూజిత పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న కృష్ణను బుధవారం పోలీసులు హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. గురువారం జోగిపేట ప్రథమ శ్రేణి న్యాయాధికారి ఎదుట నిందితుడి ప్రవేశపెట్టగా రిమాండ్ విధించారు.

మృతుడి ఖాతాలో నుంచి రూ. లక్ష మాయం!

● మరో ఖాతాలోకి డబ్బు..

నర్సాపూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులో డబ్బులు భద్రంగా ఉంటాయనుకుంటే అందులో కూడా మోసాలు జరుగుతుండటంతో ఏమిచేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని ఎస్‌బీఐ బ్యాంకులో ఖాతా ఉన్న వ్యక్తి చనిపోగా, అతని ఖాతా నుంచి రూ. లక్షా రెండు వేలు మాయమయ్యాయి. ఇదేమని ప్రశ్నిస్తే పొరపాటు జరిగింది మళ్లీ ఖాతాలో వేస్తామని బ్యాంకు అధికారులు చెప్పడం గమనార్హం. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మూసాపేట గ్రామానికి చెందిన నాగమోళ్ల లక్ష్మయ్య తండ్రి ఆగమయ్యకు నర్సాపూర్ ఎస్‌బీఐలో ఖాతా ఉంది. అతను మూడేళ్ల క్రితం మరణించగా, అప్పటికే అతని ఖాతాలో రూ. లక్షా 53వేలు ఉన్నాయి. ఆ డబ్బును తనకు ఇవ్వాల్సిందిగా ఫిబ్రవరిలో బ్యాంకు అధికారులను కోరారు. తండ్రి డెత్ సర్టిఫికెట్‌తో పాటు ఇతర ధ్రువీకరణలు తీసుకువస్తే.. లక్ష్మణ్ పేరిట ఖాతా తెరిచి అందులో వేస్తామని చెప్పారు. ఈ మేరకు లక్ష్మయ్య ధ్రువపత్రాలు సమర్పించగా, కొత్త ఖాతా తెరిచి రూ. 50 వేలు మాత్రమే ఆ ఖాతాలో జమచేశారు. తండ్రి ఖాతాలో ఇంకా రూ. లక్షా రెండు వేలు ఉండటంతో వాటి కోసం బ్యాంకునకు వెళ్లగా, నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. తర్వాత ఆ డబ్బు మరో ఖాతాలోకి వెళ్లింది. దీంతో బాధితుడు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్‌తో కలిసి బ్యాంకునకు వెళ్లి నిలదీశాడు. తమ పొరపాటు వల్ల డబ్బు మరో ఖాతాలోకి వెళ్లిందని, తిరిగి లక్ష్మయ్య ఖాతాలో వేస్తామని చెప్పారు.

క్రైం కార్నర్

కారు డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

● నలుగురికి గాయాలు

జహీరాబాద్, మార్చి 20(ఆంధ్రజ్యోతి) : కారు డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతిచెందిన సంఘటన జహీరాబాద్ పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్ఐ కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం మహబూబ్‌నగర్‌కు చెందిన ఖాజా ఫరీదుద్దీన్ తన స్నేహితులు అలీమొద్దీన్, నాసీర్, ముదాసీర్, రజువుద్దీన్‌లతో కలిసి రంజాన్ పర్వదినం సందర్భంగా బుధవారం ముంబయికి షాపింగ్ చేయడానికి వెళ్లారు. తిరిగు ప్రయాణంలో గురువారం మధ్యాహ్నం జహీరాబాద్ మీదుగా మహబూబ్‌నగర్‌కు కారులో వెళ్తుండగా పట్టణంలోని పాత ఆర్టీఏ చెక్‌పోస్టు సమీపంలో ఫ్లైఓవర్ వద్ద కారు డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలైన వారిని చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఖాజా ఫరీదుద్దీన్ మృతిచెందగా, మిగతావరిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు.

బైక్ డివైడర్‌ను ఢీకొని యువకుడు..

● మరొకరి పరిస్థితి విషమం




ఘటనా స్థలంలో బాబు మృతదేహం

కుకునూరుపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను అతివేగంగా నడపడం వల్ల ఒకరు మృతిచెందగా, మరో యువకుడి పరిస్థితి విషమంగా ఉంది. వివరాలు ఇలా ఉన్నాయి. గజ్వేల్ మండలం దిలాల్‌పూర్ గ్రామానికి చెందిన కేసారం బాబు, యాదగిరి గురువారం కల్లు తాగి కుకునూరుపల్లి మండల కేంద్రానికి బైక్‌పై అతివేగంగా వస్తున్నారు. ఒక్కసారిగా బైకు అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో బాబు(25) అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రగాయాలైన యాదగిరిని చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రెడీమిక్స్ వాహనం ఢీకొని..

రామచంద్రాపురం టౌన్ మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ జగన్నాథ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడ గ్లాండ్ ఫార్మా పరిశ్రమలో పని చేస్తున్న రవితేజ (32) చందానగర్ జవహర్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. గురువారం విధులకు హాజరయ్యేందుకు ఎలక్ట్రిక్ స్కూటీపై వెళ్తుండగా మార్గమధ్యలో హెచ్‌పీ పెట్రోలు బంకు సమీపంలో రెడీమిక్స్ వాహనం వెనుకనుంచి ఢీకొట్టింది. దీంతో అతడు తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య సంధ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్ అదుపు తప్పి రైతు..



బీరయ్య మృతదేహం

మద్దూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని లద్నూరులో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. లద్నూరు గ్రామానికి చెందిన కెమిడి బీరయ్య(65) వ్యవసాయ బోరు మోటారు కాలిపోవడంతో మరమ్మతుల కోసం జనగామ జిల్లా కేంద్రానికి వెళ్లి మరమ్మతులు చేయించాడు. డబ్బులు సరిపోకపోవడంతో గ్రామానికి వచ్చి డబ్బులు తీసుకుని జనగామకు వెళ్లాడు. అనంతరం పంపును ద్విచక్రవాహనంపై కట్టి తీసుకుని వస్తుండగా లద్నూరు గ్రామ శివారులోని మూల మలుపులో బైక్ అదుపు తప్పి పడిపోయాడు. 108లో చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు



పోలీసుల అదుపులో నిందితుడు

మనోహరాబాద్ మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రేతను పోలీసులు అరెస్టు చేశారు. మెదక్ టాస్క్‌ఫోర్స్ సీఐ భూపాల్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామంలో గంజాయి విక్రయిస్తున్నారని సమాచారం అందుకున్న పోలీసులు గురువారం అక్కడికి వెళ్లారు. ఈ క్రమంలో గ్రామంలోని ఓ వెంచర్‌లో బైక్‌పై తిరుగుతున్న సర్కార్ పార్థు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 205 గ్రాముల గంజాయి లభించింది. విచారణ చేపట్టగా పరిశ్రమలలో పని చేసి కార్మికులకు గంజాయిని విక్రయిస్తున్నట్లు నిందితుడు తెలిపారు. ఈ మేరకు పార్థును అరెస్టు చేసి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఆల్ప్రాజోలం సరఫరాదారుడికి పదేళ్ల జైలు



నిందితుడు గౌండ్ల మాధవ్ గౌడ్

హైదరాబాద్ సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆల్ప్రాజోలం రవాణా చేస్తూ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డ నిందితుడికి న్యాయస్థానం 10 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ. లక్ష జరిమానా విధించింది. సంగారెడ్డి సదాశివపేట మండలం ఆరూరు గ్రామానికి చెందదిన గౌండ్ల మాధవ్ గౌడ్ 2022లో ఆల్ప్రాజోలం రవాణా చేస్తూ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడిపై కేసు నమోదు చేసిన ఎక్సైజ్ పోలీసులు కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. వాదోపవాదనలు విన్న సంగారెడ్డి అడిషనల్ జిల్లా జడ్జి జయంతి నిందితుడికి 10 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ. 1లక్ష జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించారు.

ప్రహరీ వివాదంలో ఇంటి యజమాని ఆత్మహత్యాయత్నం

● ఎస్ఐ వేధింపులే కారణమని భార్య ఆరోపణ



చికిత్స పొందుతున్న శ్రీశైలం

కుకునూరుపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రెండు ఇళ్ల మధ్య నిర్మించిన గోడ వివాదంలో ఓ ఇంటి యజమాని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. బాధితుడి భార్య తెలిపిన వివరాల ప్రకారం కుకునూరుపల్లి మండల కేంద్రంలో తిప్పారం గ్రామానికి చెందిన డెవిడ్ గతంలో ఇల్లు నిర్మించుకున్నాడు. పక్కనే ఇండ్ల శ్రీశైలం తన స్థలంలో కొత్తగా ఇంటిని నిర్మించాడు శ్రీశైలంకు చెందిన ప్రహరీ తన ఇంటికి ఆనుకొని ఉందని డేవిడ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్ఐ శ్రీనివాస్ పలుమార్లు గోడను తీసివేయాలని శ్రీశైలంకు సూచించాడు. గురువారం మధ్యాహ్నం కూడా కానిస్టేబుళ్లు ఇంటికి వెళ్లి గోడను తొలగించాలని చెప్పగా మనస్తాపం చెందిన శ్రీశైలం పోలీసుల ముందే ఇంటిలో ఉన్న పురుగుల మందు తాగాడు. దీంతో అతడిని పోలీసులు తమ వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గోడ విషయంలో ఎస్ఐ శ్రీనివాస్ వేధించడంతోనే తన భర్త పురుగుల మందు తాగాడని శ్రీశైలం భార్య ఆమె ఆరోపించారు.

దారి వివాదంలో కుటుంబంపై దాడి

● పలువురికి తీవ్ర గాయాలు ● నలుగురిపై కేసు





దాడిలో తలకుతీవ్ర గాయాలైన బాలయ్య, అతడి కుటుంబ సభ్యులు

శివ్వంపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : దాయాదుల మధ్య ఘర్షణలో ఓ కుటుంబంపై దాడి చేయగా ఐదుగురు తీవ్రంగా గాయపడిన ఘటన గురువారం తిమ్మాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన రాసుపల్లి బాలయ్య, భిక్షపతి అన్నదమ్ములు. బాలయ్య ఇంటి వద్ద బోరు బావిలో నీళ్ల అడుగంటిపోవడంతో బోరు బావి తవ్వించడానికి తమ్ముడు భిక్షపతికి చెందిన బీడు పొలంలో నుంచి బోరు బండి కోసం దారి చేశారు. దీంతో భిక్షపతి ఆ దారిని నీళ్లతో నింపాడు. ఇది గమనించిన బాలయ్య కొడుకు నర్సింహులు మోటర్ విద్యుత్ కనెక్షన్ తొలగించాడు. బుధవారం భిక్షపతి మళ్లీ బోరు వేసి నీళ్ల పారబెడుతుండడంతో ఘర్షణ మొదలైంది. గురువారం ఉదయం గ్రామ పెద్దల సమక్షంలో మాట్లాడుకుందామని బాలయ్య, నర్సింహులు ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో భిక్షపతి హైదరాబాదులో ఉంటున్న తన కొడుకులు ప్రసాద్, రాజును పిలిపించి భార్య సుశీలతో కలిసి అర్ధరాత్రి బాలయ్య ఇంటికి వెళ్లి తలుపులు ధ్వంసం చేసి లోపలికి చొరబడి కత్తి, రాడ్లు, రాళ్లు, ఇటుకలతో కుటుంబంపై దాడికి దిగారు. ఈ ఘటనలో బాలయ్యతోపాటు అతడి భార్య పున్నమ్మ, కొడుకులు యాదగిరి, నర్సింహులు, కోడలు అంజమ్మ తీవ్రంగా గాయపడ్డారు. యాదగిరి, నర్సింహులు, అంజమ్మకు గాయాలతో తీవ్ర రక్త స్రావం కావడంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్ఐ మధుకర్‌రెడ్డిని సంప్రదించగా బాధితుల ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన భిక్షపతి, అతడి భార్య సుశీల, కొడుకులు రాజు, ప్రసాద్‌లపై కేసు నమోదు చేసి ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

వైభవంగా రుద్రపారాయణం, లక్ష పుష్పార్చన



నాచగిరి క్షేత్రం వద్ద రుద్రపారయణంలో స్వామిజీలు

వర్గల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అత్యంత ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో స్వామివారి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు ఆలయ కార్య నిర్వహణాధికారి విశ్వనాథ శర్మ పర్యవేక్షణలో ఘనంగా జరుగుతున్నాయి. గురువారం ఆలయం వద్ద రుద్ర పారాయణం, ధ్వజారోహణం, భక్తులచే లక్ష పుష్పార్చన కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. మాధవానంద సరస్వతీ స్వామి, శ్రీ క్షేత్రం పీఠాధిపతులు మధుసూదనానంద సరస్వతీ స్వామిజీ, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, సిద్దిపేట జిల్లా కోర్టు జడ్జి సాయి రమాదేవితో పాటు పలువురు ప్రముఖులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.



కరపత్రాలు పంచుతున్న ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

'మా కాలేజీలో చేరండి'

● ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ప్రచారం

నర్సాపూర్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రైవేటుకు దీటుగా విద్య అందుతున్న మా కాలేజీలో చేరండి అంటూ పెద్దచింతకుంటలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రచారం చేశారు. గురువారం ఇంటర్ పరీక్షలు ముగియడంతో నర్సాపూర్ జూనియర్ కాలేజీ కేంద్రం వద్ద కాలేజీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సురేష్ ఆధ్వర్యంలో కరపత్రాలు పట్టుకుని పరీక్షలు రాసి వస్తున్న ఇంటర్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రభుత్వ కాలేజీలో మంచి విద్యతో పాటు ఫ్యాకల్టీ, ల్యాబ్ ఇతర సదుపాయాలు ఉన్నాయని వివరించారు. ప్రైవేటులో చేరి డబ్బులు వృథా చేసుకోవద్దని, ప్రభుత్వ కళాశాలలోనే చేరాలని ప్రచారం చేశారు.

నేడు తైబజారు వేలం

జగదేవ్‌పూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మేజర్ గ్రామపంచాయతీలో శుక్రవారం ఉదయం తైబజార్ వేలంపాట నిర్వహించనున్నట్లు గ్రామ కార్యదర్శి రామిరెడ్డి తెలిపారు. జగదేవ్‌పూర్‌లోని కూరగాయల మార్కెట్,పశువులసంతకు వేలం నిర్వహిస్తున్నామన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు

కుకునూరుపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కుకునూరుపల్లి మండలం చిన్నకిష్టాపూర్ గ్రామ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష పాడ్‌లు, పెన్నులు అందజేశారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పుట్టినరోజు సందర్భంగా బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి వీటిని సమకూర్చగా, హెచ్‌ఎం విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం, బీజేపీ నాయకులు రమేష్, ఆనంద్, గణేష్ పాల్గొన్నారు.

● మద్దూరు: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మేక మల్లేశం గురువారం పరీక్షా సామగ్రిని అందించారు. ఆయన వెంట చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి, నాయకులు జక్కిరెడ్డి సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి పెద్దపీట

సిద్దిపేట టౌన్, మార్చి20(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాశాఖకు రాష్ట్ర బడ్జెట్‌లో పెద్దపీట వేయడం అభినందనీయమని ఎన్‌ఎస్‌యూఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు అజ్మత్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో సిద్దిపేటలోని గ్రంథాలయం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సాయిప్రతాప్, రాజిరెడ్డి, వంశీ, స్రవంతి, అరవింద్ పాల్గొన్నారు.

విద్యారంగానికి 20 శాతం కేటాయించాలి

మద్దూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో విద్యాశాఖకు గత సంవత్సరం కంటే ఈ సారి అదనంగా 20 శాతం కేటాయించాలని డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు చంద్రభాను కోరారు. గురువారం రేబర్తిలో మండల బాధ్యులతో కల్సి మాట్లాడారు.

సమస్య పరిష్కరించరూ!

- లో వోల్టేజీతో పంటలు ఎండుతున్నాయని రైతుల గగ్గోలు
- మోటార్ల సమస్యేనంటున్న అధికారులు

చేర్యాల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా నాణ్యమైన విద్యుత్ సరఫరా జరగకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతుండగా, చేతికొచ్చిన పంటలు నీరందక ఎండిపోతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. చేర్యాల పట్టణ శివారులోని ప్రభుత్వ బాలికల పాఠశాల సమీపంలో గల ఎస్‌ఎస్-2 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా లో-ఓల్టేజ్ విద్యుత్ సరఫరా జరుగుతుందంటూ స్థానికులు వాపోతున్నారు. దీంతో నాణ్యమైన విద్యుత్ సరఫరా జరగక, బోరునీటిని వినియోగించుకోలేక పంటలు ఎండిపోతున్నాయని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఇటీవల ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో మరమ్మతులు చేయించి రెండు రోజుల క్రితం బిగించినప్పటికీ కొంతసమయానికే మళ్లీ కాలిపోయింది. పంటలు ఎండిపోతున్న తరుణంలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల నిర్వహణలో అధికారులు తీవ్ర జాప్యం వహిస్తున్నారని రైతన్నలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అవసరమైన సమయంలో ఆన్ ఆఫ్ చేసేందుకు ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏబీ స్విచ్ కూడా లేదని మండిపడుతున్నారు. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టి లో-ఓల్టేజ్ సమస్య తీర్చాలని కోరుతున్నారు. కాగా ఈ సమస్యపై విద్యుత్ అధికారులను సంప్రదించగా ఎస్‌ఎస్-2 ట్రాన్స్‌ఫార్మర్‌పై అధిక లోడ్ పడేలా కనెక్షన్లు కూడా లేవని, రైతుల బోరు మోటార్ల సమస్య వల్లే కాలిపోయి ఉంటుందంటున్నారు. త్వరలోనే ట్రాన్స్‌ఫార్మర్‌ను సర్దుబాటు చేయనున్నట్లు విద్యుత్ అధికారులు వివరించారు.


చేర్యాల శివారులోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలి


కూలీల మస్టర్‌ను పరిశీలిస్తున్న ఏపీడీ శివాజీ

సిద్దిపేటరూరల్/కొండపాక/మద్దూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి); వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని, పని ప్రదేశంలో కనీస సౌకర్యాలను ఏర్పాటు చేసుకోవాలని ఉపాధిహామీ ఏపీడీ శివాజీ కూలీలకు సూచించారు. గురువారం సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్, మాచాపూర్ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కూలీలు ఉదయం సమయంలోనే పని పూర్తి అయ్యేలా చూసుకోవాలన్నారు. నర్సరీల్లోని మొక్కలు ఎండల తీవ్రకు వాడిపోకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో కిషన్‌రాజ్, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, ఫీల్డ్ అసిస్టెంట్లు శ్రీనివాస్, కిష్టారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కొండపాక మండలంలోని వెలికట్ట గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో వెంకటేశ్వర్లు గురువారం పరిశీలించారు. ఎండ తీవ్రత దృష్ట్యా కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందజేసి వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించాడు. మద్దూరు మండలంలోని రేబర్తి గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనుల్ని గురువారం ఎంపీడీవో రాంమోహన్ సందర్శించి పరిశీలించారు. వేసవి దృష్ట్యా పాటించాల్సిన జాగ్రత్తలపై తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో టీఏ వెంకటమ్మ, సెక్రటరీ మాధవ్ జాదవ్, ఫీల్డ్ అసిస్టెంట్ అయిలయ్య పాల్గొన్నారు.

పెద్ద చెరువును 'కొండపోచమ్మ' నీటితో నింపాలి


బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి గొల్లపల్లిలో కాలువను పరిశీలిస్తున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రతాప్‌రెడ్డి

జగదేవ్‌పూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ నియోజకవర్గం పరిధిలో రుణమాఫీ కాని రైతులందరితో కలిసి సిద్దిపేట్ కలెక్టరేట్ నుంచి సెక్రటేరియట్ వరకు వేలాది మందితో పెద్ద ఎత్తున పాదయాత్ర చేపట్టనున్నట్లు బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని మునిగడప, గొల్లపల్లి గ్రామాల శివారులో పెండింగ్‌లో ఉన్న కాలువ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో కొండపోచమ్మసాగర్ ద్వారా జగదేవ్‌పూర్ మండలానికి నీళ్లు ఇవ్వడానికి నిర్మించిన కాలువలను 99 శాతం పూర్తి చేసినప్పటికీ అక్కడక్కడా ఒకటి రెండు శాతం పెండింగ్‌లో ఉండడంతో మునిగడప పెద్ద చెరువులో నీళ్లు నింపడానికి వీలు లేకుండా పోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది గడిచినా పెండింగ్ పనులు పూర్తి చేయలేదని విమర్శించారు. ఇప్పటికైనా మునిగడప పెద్ద చెరువు కాలువ పనులు పూర్తి చేసి చెరువు నింపితే చుట్టుపక్కల 15 గ్రామాల రైతులకు మేలు జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో కేసీఆర్ చేసిన అభివృద్ధిని మరిచిన నర్సారెడ్డి రాజ్‌భవన్‌కు పాదయాత్ర చేస్తాననడం విడ్డూరంగా ఉందన్నారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా ఇచ్చేందుకు పాదయాత్ర చేస్తే నర్సారెడ్డితో తాను కూడా కలిసి పాదయాత్ర చేస్తానని ప్రతాప్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసగౌడ్, నాయకులు రంగారెడ్డి, కవితా శ్రీనివాస్‌రెడ్డి, యాదవ రెడ్డి, చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

మచ్చలేని నాయకుడు హరీశ్‌రావు

గజ్వేల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మచ్చలేని నాయకుడు హరీశ్‌రావు అని బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం కక్షపూరితంగా మాజీమంత్రి హరీశ్‌రావుపై రేవంత్‌రెడ్డి అనుచరుల ద్వారా పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసును హైకోర్టులో కొట్టి వేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ.. తీర్పుతో న్యాయం గెలిచిందన్నారు.

మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబానికి మేలు: డీపీవో


జనగామలో రుతుప్రేమ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీపీవో దేవకీదేవి

అక్కన్నపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, సమాజం బాగుపడుతుందని డీపీవో దేవకీదేవి అన్నారు. గురువారం మండలంలోని జనగామ రైతువేదికలో రుతు ప్రేమపై మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలిథీన్ వాడకాన్ని తగ్గించి క్యాన్సర్ వ్యాధిని తరిమికొట్టాలన్నారు. అనంతరం మహిళలకు సిలికాన్ కప్పు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో బానోతు జయరాం, మండల వైద్యాధికారి డాక్టర్ రమ్య, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దంత సంరక్షణపై అవగాహన

నంగునూరు మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలమాకుల లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో వరల్డ్ డెంటల్ డే సందర్భంగా గురువారం సురభి మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు దంతాల సంరక్షణపై డాక్టర్ సాహితీ, డాక్టర్ సందీప్ ల నేతృత్వంలో అవగాహన కల్పించారు. పిల్లలకు దంత సంరక్షణకు సంబంధించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వర్గీస్, డైరెక్టర్ పబ్బోజు సత్యనారాయణ, హాస్పిటల్ సిబ్బంది పరశురాములు, రాజు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు హుస్నాబాద్ విద్యార్థి

హుస్నాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు హుస్నాబాద్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి గౌరవేని రిష్వంత్ ఎంపికైనట్లు పాఠశాల పీడీ ఆర్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం సిద్దిపేటలో జరిగిన 400 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్ మెడల్, 100 మీటర్ల పరుగు పందెంలో సిల్వర్ మెడల్ సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 23వ తేదీన హైదరాబాద్ గార్డియం ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో రిష్వంత్ పాల్గొననున్నట్లు తెలిపారు.

నీటి ఎద్దడి నివారణకు ఎన్నారై కృషి

మద్దూరు, మార్చి 20 : మండలంలోని మర్మాముల గ్రామంలో నీటి ఎద్దడి సమస్య పరిష్కారానికి ఎన్నారై ఇప్ప నిశికాంత్‌రెడ్డి కృషిని గ్రామస్థులు అభినందిస్తున్నారు. గురువారం ఎన్‌ఆర్‌ఐ నిశికాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వం తనకు అందించిన రైతుబంధు డబ్బు సుమారు రూ. ఒక లక్ష గ్రామాభివృద్ధి కోసం అందజేసినట్టు తెలిపారు. గ్రామంలో నీటి ఎద్దడి ఏర్పడటంతో గ్రామస్థుల కోరిక మేరకు తాను అందజేసిన డబ్బు నుంచి రూ.30 వేలు ఖర్చు చేసి గ్రామపంచాయతీ బోరుకు కొత్త మోటార్, పైప్‌లైన్ ఏర్పాటు చేసి వినియోగంలోకి తెచ్చినట్టు తెలిపారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పాఠశాలలో పనుల పూర్తికి సహకారం

నంగునూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిధుల కోసం ఎదురు చూడకుండా ప్రభుత్వ పాఠశాల నెలకొన్న అసంపూర్తి పనులను పూర్తి చేసేందుకు దాతలు ముందుకు వస్తున్నారు.. హైదరాబాదులో స్థిరపడిని మండలంలోని నర్మెట్ట గ్రామానికి చెందిన రాళ్ల బండి రమణచారి స్వగ్రామంలో తాను చదివిన బడిలో అసంపూర్తిగా ఉన్న ప్రహరీ, గేటు, కిచెన్ షెడ్ నిర్మాణాలను పూర్తి చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు సుమారు రూ.3 లక్షల విలువ చేసే పనులు పూర్తి చేసేందుకు రమణాచారి సహకరించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం అసంపూర్తి పనులు పూర్తి చేసినందుకు మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, ఎంఈవో దేశిరెడ్డితో కలిసి రమణాచారి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ రజిత కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పలు మండలాల్లో సీసీ రోడ్ల పనులు ప్రారంభం


ములుగులో ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న నర్సారెడ్డి

ములుగు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన ములుగులోని ఎస్సీ కాలనీలో పోచమ్మ గుడి వద్ద సీసీరోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. పోచమ్మ గుడి చుట్టూ సీసీ నిర్మాణం చేయడానికి రూ.7 లక్షల నిధులు విడుదల చేశారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● నంగునూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంక్షాపూర్ గ్రామానికి ఎస్‌ఆర్‌ఈజీ ఆధ్వర్యంలో రూ.15 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విడతలవారీగా గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం అలుగు పారుతున్న నబీ చెరువులో జలహారతి ఇచ్చి పూజలుచేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్, నాయకులు పాల్గొన్నారు.

● చేర్యాల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరన్నపేట గ్రామంలో ఉపాధిహామీ ద్వారా రూ.10లక్షల వ్యయంతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణం పనులను గురువారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంజ మల్లేశం, మాజీ సర్పంచు కొండపాక భిక్షపతి, గ్రామశాఖ అధ్యక్షుడు సూర్ణ శ్రీకాంత్ ప్రారంభించారు.

● అక్కన్నపేట: మండలంలోని మోత్కులపల్లి గ్రామంలో ఎంఎన్‌ఆర్జీఎస్ నిధులు రూ.10 లక్షల వ్యయం కాగల సీసీ రోడ్డు నిర్మాణం పనులకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి గురువారం భూమి పూజ చేశారు. మండలంలోని అంతకపేట, జనగాం, రామవరం, గొల్లపల్లి, మోత్కులపల్లి గ్రామాలకు ఎంఎన్‌ఆర్జీఎ‌స్ గ్రాంట్ నుండి రూ, 50 లక్షల నిధులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మంజూరు చేశారని తెలిపారు.

కిట్ల.. కిరికిరి..!

(5వ పేజీ తరువాయి)

తాము పంచితే బీఆర్‌ఎస్‌కు వచ్చిన నష్టమేమిటని ప్రశ్నిస్తున్నారు.

నేడు అందజేసేందుకు ఏర్పాట్లు

కిట్లలో 10 కిలోల బియ్యంతో పాటు నిత్యవసరుకులు పప్పు, ఉప్పు, మిర్చి, పసుపు, చింతపండు, పాల పదార్థాలు, సేమియా తదితరమైన సరుకులను రెండు స్వచ్ఛంధ సంస్థలు పంపడంతో మదీనా ఫంక్షన్ హాల్‌లో సిద్ధంగా ఉంచారు. ఆ కిట్లను నేడు ఉదయం ఆరు గంటలకు ముస్లిం వర్గానికి చెందిన నిరుపేదలకు అందించేందుకు ఇరు పార్టీలు ఎవరికి వారు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. రెండు రోజుల నుంచి రంజాన్ తోఫాల విషయమై సిద్దిపేటలో ఇరు పార్టీల మధ్య జరుగుతున్న రగడపై చర్చనీయాంశంగా మారింది.

పోలీసులకు టెన్షన్...

రంజాన్ తోఫాల విషయమై బీఆర్‌ఎస్ వర్సెస్ కాంగ్రెస్‌గా మారడంతో పోలీసులకు ఇప్పుడు తలనొప్పిగా మారింది. పంపిణీ పంచాయతీ కాస్త పోలీసుల దాకా వెళ్లడంతో కిట్లు ఉన్న ఫంక్షన్‌హాల్ వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. రాత్రి వరకు ఇరుపార్టీల నాయకులను పోలీసులు శాంతింపచేస్తారా? లేదా అనేది ఉదయం వర కు వేచిచూడక తప్పేలా లేదు. ఉదయం పంపిణీ కార్యక్రమం ఎలా జరుగుతుందోనని ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఉత్కంఠతో ఉండగా, అసలు పంపిణీ జరుగుతుందా అని నిరుపేదలు ఎదురుచూస్తున్నారు.


మదీనా ఫంక్షన్‌హాల్ వద్ద పంపిణీకి సిద్ధంగా ఉన్న రంజాన్ కిట్లు

కోహెడలో ఇసుక అక్రమ దందా

కోహెడ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇసుక మాఫియా పెట్రేగిపోతుంది. స్థానికంగా ఉన్న మోయ తుమ్మెద, రేణుక ఎల్లమ్మ, పిల్లి వాగుల నుంచి పెద్ద మొత్తంలో ఇసుకను తవ్వి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఆయా గ్రామాల్లో కొంతమంది ఇసుక మాఫియాగా ఏర్పడి శివారు ప్రాంతాల్లో భారీ మొత్తంలో ఇసుక డంపులను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఎవరైనా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారు. మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా భారీ మొత్తంలో ఇసుకను డంపు చేశారు. రాత్రి 8గంటల ప్రాంతంలో చుట్టుపక్కల వాగుల నుంచి సేకరించిన ఇసుకను కొన్నిచోట్ల డంపు చేసి, అర్ధరాత్రి నుంచి తెల్లారేలోపు లారీలలో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ అక్రమ దందాను కట్టడి చేయడంలో రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్రమ దందాకు అడ్డుకట్ట వేసి, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఎండుతున్న పంటలతో ఉక్కిరిబిక్కిరి


ఎండుతున్న పొలంలో విలపిస్తున్న రైతు

గజ్వేల్ రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి అప్పులు చేసి సాగు చేసిన రైతన్నలకు పంట చేతికొచ్చే సమయంలో నీరందక ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మండుటెండలకు తోడు భూగర్భజలాలు ఇంకిపోయి బోర్లలో నీరు రావడంలేదు. దానికి తోడు సరైన విద్యుత్ సరఫరా లేక మోటార్లు కాలిపోతున్నాయి. అప్పులు చేసి పంటలు సాగు చేసినా పంటలకు నీరందక ఎక్కడికక్కడ ఎండిపోతున్నాయి. మండలంలోని జాలిగామ గ్రామానికి చెందిన నాయకం మధు 4 ఎకరాలు వరి సాగు చేశాడు. బోరులో నీళ్లు రావడంలేదని తెచ్చిన అప్పులు ఎలా కట్టాలో తెలియక సతమతమవుతూ కన్నీటి పర్యంతమవుతున్నాడు. దీంతో కుటుంబ పోషణ కూడా భారమైంది. అప్పులు ఇచ్చిన వాళ్లు ఒత్తిడి చేస్తున్నారని రైతు వాపోతున్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితరైతు విజ్ఞప్తి చేస్తున్నాడు.

'రాజీవ్ యువ వికాస్'ను అగ్రవర్ణ పేదలకు వర్తింపజేయాలి

● రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షుడు మల్లిఖార్జున్‌రెడ్డి

హుస్నాబాద్‌రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస పథకంలో అగ్రవర్ణ పేదలకు ఈ పథకం వర్తింప చేయాలని రెడ్డి జేఏసీ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు అయిలేని మల్లిఖార్జున్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం హుస్నాబాద్ మండలం పందిల్లలో మల్లిఖార్జున్‌రెడ్డి రెడ్డి జేఏసీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రెడ్డిలలోని పేదలను ఆదుకుంటామని చెప్పినట్లు గుర్తు చేశారు. అగ్రవర్ణాలలో అనేక మంది ఉన్నత చదువులు చదువుకుని ఉద్యోగాలు లేక నిరుద్యోగులుగా మిగిలిపోయారన్నారు. ఏ ఆధారం లేని నిరుపేద రెడ్డిలకు రాజీవ్ యువ వికాస పథకంలో అవకాశం కల్పించి వారిని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. లేని పక్షంలో రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో న్యాయ పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో అలుమల్ల నర్సింహరెడ్డి, అయిలేని శంకర్‌రెడ్డి, గాల్‌రెడ్డి, సంపతి రాజిరెడ్డి, ఏలూరి మల్లారెడ్డి, మంద జానకి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి


ధర్మారంలో ఇందిరమ్మ లబ్దిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ

మద్దూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పనుల వేగవంతానికి చర్యలు చేపడుతున్నట్లు హౌసింగ్ డీఈ దామోదర్‌రావు తెలిపారు. గురువారం గ్రామానికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలించారు. అదనంగా మరి కొంతమంది దరఖాస్తు చేసుకున్న వారి స్థలాలను సైతం సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీలో ఎంపీడీవో రాంమోహన్‌తో కల్సి లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారు 30 రోజుల్లోపు తప్పని సరిగా ముగ్గు పోసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన విస్తీర్ణంలో నిర్మాణాలు చేపట్టుకోవాలని సూచించారు. గతంలో ఫొటో దిగిన స్థలంలో కాకుండా మరో స్థలంలో నిర్మాణాలు చేపట్టేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందన్నారు.

ఆగిపోయిన అభివృద్ధిపై కాంగ్రెస్ వైఖరి ఏంటి?


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

సిద్దిపేట టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటలో ఆగిపోయిన అభివృద్ధిపై కాంగ్రెస్ నాయకుల వైఖరి ఏమిటో నియోజకవర్గ ప్రజలకు వెల్లడించాలని బీఆర్‌ఎస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు మచ్చవేణుగోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సిద్దిపేట పటణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ సిద్దిపేట కాంగ్రెస్ నాయకులు సిద్దిపేటకు నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తే తాము రాజకీయాలు వదులుకోవడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో సైతం సిద్దిపేట నియోజకవర్గానికి అనేక నిధులు తీసుకువచ్చిన ఎమ్మెల్యే హరీశ్‌రావు అభివృద్ధి చేస్తే, కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో సిద్దిపేటకు బడ్జెట్‌లో మొండిచేయి చూపడం బాధాకరమన్నారు. 90 శాతం పని పూర్తి చేసుకున్న మెడికల్ కళాశాల అనుబంధ మెడికల్ కళాశాలకు మిగిలిన 10 శాతం నిధులు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించలేదన్నారు. తమకు రాజకీయాలు ముఖ్యం కాదని సిద్దిపేట అభివృద్ధి తమ లక్ష్యమన్నారు. కాగా ఈ నెల 23న సిద్దిపేట పట్టణంలో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు, బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రంజాన్ పర్వదినం సందర్భంగా ఇఫ్తార్ పార్టీ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అత్తర్ పటేల్, కౌన్సిలర్ వజీర్, నాయకులు మోహిజ్, ఇర్షాద్ హుస్సేన్ తెలిపారు. ఆదివారం సాయంత్రం మదీనా ఫంక్షన్‌హాల్ పక్కన గల ఈద్గా వద్ద ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం

ధూళిమిట్ట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు అమోదం పొందిన సందర్భంగా గురువారం మండల కేంద్రంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సుందరగిరి భాస్కర్ మాట్లాడుతూ.. గత 30 ఏళ్లుగా అలుపెరుగని పోరాటం చేసిన మందకృష్ణ మాదిగవల్లే వర్గీకరణ సాధ్యమైందన్నారు.

టీపీసీసీ చీఫ్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్సీ నాగపురి

చేర్యాల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను చేర్యాల పట్టణానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం, పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. 42శాతం రిజర్వేషన్ల అమలుకు అసెంబ్లీ ఆమోదం పొందడానికి కృషిచేయడం పట్ల అభినందనలు తెలిపారు.

'ఒకే దేశం.. ఒకే ఎన్నిక' పై సమావేశం

చేర్యాల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఒకే దేశం, ఒకే ఎన్నిక పట్ల బీజేపీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక వాసవీ గార్డెన్స్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమ జిల్లా కన్వీనర్ పజ్జూరి లక్ష్మీనర్సయ్య మాట్లాడుతూ ఒకే దేశం, ఒకే ఎన్నికతో ప్రజాధనం వృథా కాదన్నారు. ఒకే దేశం, ఒకే ఎన్నిక కు బీజేపీ చేస్తున్న ప్రయత్నానికి ప్రజలకు వివరించి మద్దతు కూడగట్టేందుకు పార్టీ కార్యకర్తలు పాటుపడాలని కోరారు.